గేటెడ్ కమ్యూనిటీలోకి పోస్టల్ సర్వీస్‌ను తప్పనిసరిగా అనుమతించాలి

ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి

చందానగర్: చందానగర్ సర్కిల్ 21 పరిధిలోని హైరైజ్ అపార్ట్‌మెంట్స్, గేటెడ్ కమ్యూనిటీలోకి, మల్టీ స్టోర్డ్ బిల్డింగ్స్‌లోకి పోస్టల్ డెలివరీ సర్వీస్‌ను అనుమతించాలని ఉపకమిషనర్ మోహన్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఇటీవల హైదరాబాద్ పోస్టల్ సర్వీస్‌ను వివిధ రకాల గేటెడ్ కమ్యూనిటీలలో అనుమతించడం లేదని సంబంధిత విభాగం ఉన్నతాధికారులు జీహెచ్ఎంసీ దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ ఆదేశాల మేరకు చందానగర్ సర్కిల్ 21 పరిధిలోని హైరైజ్ అపార్ట్‌మెంట్స్, గేటెడ్ కమ్యూనిటీలు, మల్టీ స్టోర్డ్ భవనంలోకి తప్పనిసరిగా పోస్టల్ సర్వీస్‌ను అనుమతించాలని ఆదేశించామన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం నిర్వహించిన డ్రైవ్‌లో 9 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఐదుగురికి ఒక్కొక్కరికి రూ.వెయ్యి, మరో నలుగురికి రూ.1500 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

బసవతారకనగర్‌లో సీపీఎం నాయకుల పర్యటన



రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ బసవతారకనగర్‌లో సీపీఎం నాయకులు మంగళవారం పర్యటించారు. సీపీఎం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్‌వెస్లీ, రాష్ట్ర నాయకుడు డీజీ నర్సింహారావు, సీపీఎం నాయకులు బస్తీవాసులతో మాట్లాడారు. గుడిసెవాసుల సమస్యలు తీరే వరకు అండగా ఉంటామని, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పగడాల యాదయ్య, నాయకులు శోభన్, కృష్ణ, అతీక్, జార్జ్‌కృప, అనీల్, శ్రీనివాస్, జంగయ్య, శివుడు తదితరులు పాల్గొన్నారు.

'కాయిదమ్మ' కోనేరు ఇలా..



కాయిదమ్మకుంట చెరువు వద్ద ఉన్న కోనేరులో పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు



కోనేరు వద్ద వాహనాల పార్కింగ్



చెరువులో తొలగించిన గుర్రపు డెక్కను కోనేరు వద్ద వేసిన దృశ్యం



విరిగిపోయిన బెంచీలు

చందానగర్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని కాయిదమ్మకుంట చెరువు వద్ద జీహెచ్ఎంసీ అధికారులు వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం ప్రత్యేకంగా కోనేరును నిర్మించారు. పండగల అనంతరం వాటిని పట్టించుకోకపోవడంతో చెత్తచెదారం, వ్యర్థాలతో దుర్వాసన వెదజల్లుతుంది. కోనేరు చుట్టూ ఉన్న గ్రిల్స్ రాడ్స్ విరిగిపోయాయి.

- చెత్త చెదారం తొలగించకపోవడంతో గుట్టలుగా వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. చెరువులోని గుర్రపుడెక్కను తొలగించి కోనేరు పక్కనే వేయడంతో దుర్గంధం వెదజల్లుతుంది.
- కోనేరు వద్ద ఏర్పాటు చేసిన బెంచీలను ఆకతాయిలు ధ్వంసం చేశారు. అధికారులు స్పందించాలని పరిసరప్రాంత ప్రజలు కోరుతున్నారు.

ఎముకలు ఎంత బలంగా ఉంటే అంత ఆరోగ్యం

ఆల్విన్‌కాలనీ: మానవ శరీరంలోని ఎముకలు ఎంత బలంగా ఉంటే అంత ఆరోగ్యంగా ఉంటామని డాక్టర్ ఎన్. వంశీరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం చిరాక్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో మానవ ఎముకలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ శరీరంలో ఎముకలు బలంగా ఉండాలంటే కాల్షియం ఎక్కువగా ఉండే పాలు, పెరుగు, బాదం, ఆకుకూరలు వంటి పదార్థాలు పిల్లలకు ఎక్కువ మోతాదులో అందించాలని తల్లిదండ్రులకు వివరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జంక్ ఫుడ్ ఇవ్వవద్దన్నారు. ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలు తీసుకునే విధంగా అలవాటు చేయాలని సూచించారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వంశీరెడ్డి

రేపు గురుపౌర్ణమి వేడుకలు

ఆల్విన్‌కాలనీ: గురు పౌర్ణమి సందర్భంగా ఆల్విన్‌కాలనీలోని సాయిబాబా ఆలయంలో గురువారం వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు ఎస్.కపిల్‌రాజ్ మంగలవారం పేర్కొన్నారు. ఉదయం 6 గంటలకు అభిషేకం, 10 గంటలకు లక్ష పుష్పార్చన, 12.30 గంటలకు అన్నదానం, సాయంత్రం 7 గంటలకు పల్లకీసేవ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆలయ అర్చకులు వై. పవన్ కుమారచార్యులు కోరారు.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య

గచ్చిబౌలి: ప్రేమ విఫలమై ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపిన ప్రకారం .. ఓ ఐటీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్న సాక్షం రాజ్(28) కొవల్లురీస్ ద కాసా అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నాడు. మంగళవారం ఉదయం సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రేమ విఫలం కావడంతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తుందని పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చందానగర్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. వివరాలలోకి వెళితే.. పటాన్‌చెరు మండలం ఇంద్రేశానికి చెందిన అరవింద్ (25) విద్యుత్‌స్తంభం పైనుంచి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం మదీనాగూడలోని సిదార్థ న్యూరో హాస్పిటల్‌కు తీసుకువచ్చారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కాగా వైద్యుల నిర్లక్ష్యం వల్లనే అరవింద్ మృతి చెందాడని బంధువులు ఆరోపించారు. చికిత్స కోసం లక్ష రూపాయలు కట్టించుకున్నారని హాస్పిటల్ సిబ్బందితో మృతుని బంధువులు వాగ్వాదానికి దిగారు. ఇదిలా ఉండగా చికిత్స కోసం వచ్చినప్పుడే రోగి పరిస్థితి విషమంగా ఉందని తెలియజేశామని ఆస్పత్రి యాజమాన్యం పేర్కొంది.

ప్రతి ఆదివారం గంగాపూర్ దత్తాత్రేయ ఆలయానికి బస్సు

మియాపూర్: మియాపూర్ ఆర్టీసీ–2 డిపో పరిధిలో ప్రతి ఆదివారం పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ వెంకటేశం ఓ ప్రకటనలో తెలిపారు. మియాపూర్ నుండి జహీరాబాద్ మీదుగా కర్ణాటక రాష్ట్రంలోని గంగాపూర్‌లో శ్రీ దత్తాత్రేయ ఆలయానికి ప్రతి ఆదివారం బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ఈ బస్సులు ఈ నెల 13వ తేదీ నుండి ప్రారంభం కానున్నాయని తెలిపారు. ప్రతి ఆదివారం ఉదయం 5 గంటలకు మియాపూర్ నుండి బయల్దేరుతుందని తెలిపారు. 30 మందికి పైగా భక్తులుంటే ఏరోజైనా ప్రత్యేక బస్సు అందుబాటులో ఉంటుందని తెలిపారు. వివరాలకోసం 9059162162, 9959226420 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలి

శేరిలింగంపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఎంసీపీఐ (యూ) కార్యదర్శివర్గ సభ్యులు మట్టయ్య డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన ఆరు హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం శేరిలింగంపల్లి తహసీల్దార్ కార్యాలయంఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా మట్టయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీలను అమలు చేస్తామని అధికారంలో వచ్చి, ఒక ఉచిత బస్సు మాత్రమే అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. మిగతా హామీలను ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇల్లు, వికలాంగులకు రూ.6 వేలు, వితంతువులకు రూ. 4 వేల హామీల సంగతి ఏంటని ప్రశ్నించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంసీపీఐ (యూ) నాయకులు వనం సుధాకర్, సుకన్య, కళావతి, తుకారాం నాయక్, దానయ్య, విమల, లలిత, అనిత, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



శేరిలింగంపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఎంసీపీఐ (యూ) నాయకులు, కార్యకర్తలు

బీఎల్‌ఓలకు శిక్షణ

చందానగర్: చందానగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళ్యాణ మండపంలో సర్కిల్ 21 పరిధిలోని బూత్ లెవెల్ ఆఫీసర్లకు మంగళవారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమంను ఏఈఆర్‌ఓ మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఓలు, ఎన్నికలకు సంబంధించిన ఫారంలు, దరఖాస్తుల స్వీకరణ తదితర అంశాలపై మూడు రోజుల పాటు శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈఆర్‌ఓ, అసెంబ్లీ లెవెల్ మాస్టర్లు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లిలో..

శేరిలింగంపల్లి: కుటుంబ సభ్యులు అంతా ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉండేలా చూడాలని శేరిలింగంపల్లి ఈఆర్‌ఓ, డిప్యూటీ కమిషనర్ వి. ప్రశాంతి తెలిపారు. శేరిలింగంపల్లిలోని జోనల్ కార్యాలయంలో నిర్వహించిన బీఎల్‌ఓల శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ బీఎల్‌ఓ పరిధిలో ఉండే వారికి ఇతర ప్రాంతాల్లో ఓటు హక్కు ఉంటే వారికి ఫారం 8 ద్వారా వారు ఉండే పోలింగ్ స్టేషన్‌లోకి మార్చే విధంగా చూడాలన్నారు. మాస్టర్ ట్రైనర్స్ శ్రీనివాస్‌రెడ్డి, జి.శ్రీనివాసులు శిక్షణ ఇవ్వడంతో పాటు మధ్యాహ్నం వారికి రాత పరీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీలు శ్రవణ్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ అవినాష్ తదితరులు పాల్గొన్నారు.



శేరిలింగంపల్లిలో.. ఈఆర్‌ఓ, డీసీ ప్రశాంతి తదితరులు

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

ఆల్విన్‌కాలనీ: కొత్త, పాత అనే తేడా లేకుండా రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు సమష్టిగా పని చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ అన్నారు. మంగళవారం హైదర్‌నగర్ డివిజన్ నూతన కార్యవర్గ సమావేశం ఆదిత్య నగర్ కమ్యూనిటీ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సమస్యలపై దృష్టి సారించి రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరవేసే దిశగా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు బెంచీలు వితరణ

రాయదుర్గం: స్వర్గీయ కొమరగాని శంకర్‌గౌడ్ జ్ఞాపకార్థం గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలకు బెంచీలు, ఆఫీస్ టేబుళ్లను ఆయన కుమారుడు కొమరగాని వెంకటేష్‌గౌడ్, అఖిల్‌గౌడ్ ,మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టిసాయిబాబాతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు రాజశేఖర్‌రెడ్డి, శ్యామల, ఉపాధ్యాయులు నరహరి, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఈశ్వరయ్య, సుధాకర్, అరుణ్, కిషోర్, నవీన్,ప్రభాకర్, సత్తయ్య, పవిత్రమ్మ పేర్కొన్నారు.



కార్యక్రమంలో కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సాయిబాబా, దాత అఖిల్‌గౌడ్